
కథ

'నూతన నటీనటులు కావలెను' అని ముద్రించి ఉన్న న్యూస్ పేపరులో కట్టిన వేరుశెనక్కాయలు తిన్న శ్రీను తన పక్కనే ఉన్న తన ఫ్రెండు అరుణ్‌కి ఆ ప్రకటన చదివి వినిపించాడు.

"అయితే, నువ్వు ప్రయత్నం చేయరా...హీరో ఛాన్సు కొట్టెయ్యవచ్చు." నవ్వుతూ అన్నాడు అరుణ్.

# సంఘటన

ఎ.ఎస్. మల్లికార్జున



శ్రీను కంగారు నటిస్తూ, "అది ఒక్కటే తక్కువరా నా మొహానికి. మనీలో బ్రహ్మానందంలాగా నాతో ఆడేసుకుందామని చూస్తున్నావా?!" అన్నాడు.

అరుణ్ నవ్వి, "అబ్బే...అది కాదురా. సరదాగా అన్నాన్రా. అవును...నువ్వు ఇంతకుముందు అసిస్టెంటు డైరెక్టరుగా ప్రయత్నం చేశావుకదరా....ఏమైంది!" కుతూహలంగా అడిగాడు.

శ్రీను నిట్టూరుస్తూ, "కసాయిదిబ్బల కత్తులరెడ్డి' అనే సినిమా షూటింగులో డైరెక్టరుని కలిశాను. ఆయన మంచి ఫ్యాక్షన్ కథ ఉంటే తీసుకొస్తే అసిస్టెంటు డైరెక్టరు ఛాన్సు ఇస్తానని చెప్పాడు. అప్పటినుంచి పాత తెలుగు సినిమాలు చూసి కొంచెం ఫ్యాక్షన్ మిక్స్ చేసి కథ తయారుచేస్తున్నాను" అన్నాడు.

***

శ్రీను, అరుణ్ చిన్నప్పటినుంచి క్లాస్ మేట్సు. డిగ్రీ పూర్తిచేసి కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కి సిద్ధం అవుతున్నారు. ప్రస్తుతం వారిద్దరూ గోదావరి తీరంలో లాంచీల రేవువద్ద ఉన్నారు. కారణం వారి ఫ్రెండు భానుశంకర్ గృహప్రవేశానికి పట్టిసీమ వెళ్తున్నారు. బస్సు సౌకర్యం ఉన్నా, లాంచీ ప్రయాణం సరదాగా ఉంటుందని లాంచీ ఎక్కడానికి వచ్చారు.

లాంచీ గోదావరిలో బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. స్నేహితు లిద్దరూ లాంచీ ఎక్కి కూర్చున్నారు. అప్పటికే లాంచీ అంతా నిండిపోయింది.

ఇంతలో ఒకతను ఆదరాబాదరాగా లాంచీ ఎక్కి వారి దగ్గరకు వచ్చి, "కొంచెం జరగండి, సార్" అన్నాడు.

అరుణ్ జరిగాడు. థాంక్సు చెబుతూ, అతను కూర్చున్నాడు. ఆ వ్యక్తిని చూడడానికి హుందాగానే ఉన్నా, ఏదో తెలియని లోపం ఉందనిపించింది వారికి. లాంచీ గోదావరి మధ్యలోకి వచ్చింది. పిల్లలకు చిల్లర పైసలు ఇచ్చి గోదావరిలో వేయమంటున్నారు వాళ్ల పెద్దవాళ్లు. కొందరు గోదావరిని చూస్తూ సందడిగా మాట్లాడుకుంటున్నారు. శ్రీను, అరుణ్ లాంచీ పైకి ఎక్కారు. వారి పక్కన కూర్చున్న వ్యక్తి పైకి ఎక్కకుండా ప్లాట్‌ఫారంపై నిల్చుని చూస్తున్నాడు.

ఆ వ్యక్తిని పరీక్షగా చూసిన శ్రీను, "ఒరేయ్ అరుణ్! అతని ముక్కు చూశావా...ఎంత తప్పడిగా ఉందో; కుష్ఠువాడిలాగా ఉన్నాడురా!" అన్నాడు.

ఆతనికి, తమకి కొంచెం దూరం ఉండడంవల్ల గోదావరి హోరులో తమ మాటలు అతనికి వినబడలేదని నిర్ధారణ చేసుకున్న అరుణ్, "నోర్మూస్తావా...ఏదో జబ్బు ఉందనుకో.

నీ కెందుకు?" కోపంగా అన్నాడు.

శ్రీను లేచినుంచుని గోదావరిని చూస్తున్నాడు. చల్లగా వీచే పిల్లతెమ్మెరలను ఆస్వాదిస్తున్నారు మిత్రులిద్దరూ నిశ్శబ్దంగా. 'వేదంలా ఘోషించే గోదావరి....' అన్న పాటను హమ్ చేస్తున్న శ్రీను దబ్‌మని శబ్దం కావడంతో వెనుదిరిగి చూశాడు. ప్లాట్‌ఫారంపై నిల్చున్న ఆ వ్యక్తి నీళ్లలో పడి కొట్టుకుంటున్నాడు. శ్రీను వెంటనే ప్లాట్‌ఫారంపైకి దిగి అతనికి చేయి అందించాడు. అతను ఒక్కసారిగా నీళ్లపైకి వచ్చి గాలి పీల్చుకున్నాడు. అతని చేతివేళ్లు సగంవరకు ఉండి, మిగిలిన భాగం ఎర్రగా మాంసం ముద్దలాగా ఉండడం చూసిన శ్రీనుకు ఒళ్లు జలదరించి అతని చేయి వదిలేశాడు. అంతలో లాంచీ సిబ్బంది వచ్చి అతడిని రక్షించారు. అతని చేతులు, కాళ్లకు వేళ్లు వంకరగా, ఎర్రగా చీము పట్టినట్లుగా ఉండడం చూసిన శ్రీను తన చేతులను ఒకటికి పదిసార్లు శుభ్రంగా కడుక్కున్నాడు.

పది నిమిషాలకు అతను సర్దుకుని తన సంచీలోని టవలు తీసుకుని తల తుడుచుకుని తనని రక్షించిన లాంచీ సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ప్రయాణీకులలో ఒకరు ఫ్లాస్కులోని టీ అతనికి ఇచ్చారు. అతను అరుణ్ పక్కన కూర్చున్నాడు. తనని అందరూ చూస్తుండడంతో ఇబ్బందిగా ఫీలై అరుణ్‌వైపు తిరిగి, "పైకి వెళ్లి కూర్చుందాం...వస్తారా!" అని అభ్యర్థిస్తున్నట్లు అడిగాడు.

అరుణ్, అతను టాప్‌పై కూర్చున్నారు. శ్రీను రోతగా, చిరాగ్గా అతనిని చూడడం అరుణ్ గమనించాడు.

"కొంచెం కాలు స్లిప్ప్ అయి పడిపోయానండీ...ముందు ఎవరో నాకు చేయి అందించారు...స్లిప్ అయుంటుంది. ఆ తరువాత మళ్లీ చేయందుకుని లాంచీవాళ్లు రక్షించారు" అన్నా డతను. "ఓ సారీ...నా పేరు చెప్పనేలేదు. నా పేరు ప్రసాద్. నేను రాజమండ్రి ఆంధ్రా బ్యాంకులో పని చేసేవాడిని. అప్పట్లో నాకు లేని చెడ్డ అలవాటు లేదు. మా పేరెంట్సును సరిగా పట్టించుకునేవాడిని కాదు. చాలా అల్లరిచిల్లరగా తిరిగాను. నాకు పెళ్లి సంబంధం కుదిరే టైములో నా ఒంటిమీద చిన్న మచ్చలులాగా వచ్చాయి. డాక్టరుకు చూపించుకోకుండా అశ్రద్ధ చేశాను. కొంతకాలానికి ఇలా తయారయ్యాను. ఆ తరువాత డాక్టరుకి చూపించి మందులు వాడుతున్నాను. అందరూ నన్ను అసహ్యంగా చూస్తుండడంతో లీవుపెట్టి ఇలా ఊళ్లమీద పడి తిరుగుతున్నాను. మా చిన్నాన్నగారింటికి పట్టిసీమ వెళ్తున్నాను" అని చెప్పాడు ప్రసాద్.

ఆయన చెప్పిందంతా విన్న అరుణ్ సానుభూతిగా, "పోన్లెండి...ఇప్పుడు మీ ఆరోగ్యం బాగానే ఉందికదా" అనడిగాడు.

"ఆ...ప్రస్తుతానికి బాగానే ఉందికాని, కొంచెం ముక్కు తప్పిడిగా ఉంది. అదికూడా ప్లాస్టిక్ సర్జరీద్వారా సరిచేయవచ్చు నన్నారు డాక్టరుగారు" అని చెప్పాడు ప్రసాద్.

### అమీష అసూయ!

దుబాయిలో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొనేందుకు, తన తల్లి ఆశతో సహా వెళ్లింది అమీషాపటేల్, అక్కడ తోటి నటి ఊర్మిళామాతోండ్కర్‌కు తన కన్నా ఎక్కువగా పారితోషికం ఇచ్చారని తెలిసింది. ఏం చేసిందో తెలుసా? తనకు షోలో వేసుకోవటానికి ఇచ్చిన బట్టలన్నిలు బాగులేవని వంకలు పెట్టింది. అటు పైన కార్యక్రమానికి స్పాన్సర్ చేస్తున్న నగలవర్తకుల దగ్గరికి వెళ్లి, తనకూ, తన తల్లికీ అచ్చమైన వజ్రాలు తాపిన ఉంగరాలు బహూకరించమని డిమాండ్ చేసిందట. ఆ వజ్రాల సంగతేమో కానీ, వాళ్లు మాత్రం రాళ్లలా నిలబడిపోయారట ఆమె కోరిక విని!

ఎస్.



అరుణ్ రాస్తున్న బి.ఎస్.ఆర్.బి., ఆర్.ఆర్.బి. కాంపిటేటివ్ పరీక్షల కోసం మాట్లాడుకున్నారు. శ్రీనుమాత్రం వారి సంభాషణలోకి రాకుండా దూరంగా నిల్చుని ప్రసాద్‌ని అసహ్యంగా చూస్తున్నాడు.

అరుణ్‌కి ప్రసాద్ మాటలవలన అతనంటే అభిమానం కలిగింది. పట్టిసీమ చేరుకున్నాక వీడ్కోలు చెప్పి తన దారిన ప్రసాద్ వెళ్లిపోయాడు.

శ్రీను అరుణ్ దగ్గరికి వచ్చి, "ఏమిటిరా...ఆ కుష్ఠోడితో ఆ మాటలూ, నువ్వునూ?!" అని కసురుకున్నాడు.

భానుశంకర్ ఇంటికి చేరుకునేసరికి మిగతా మిత్రబృందంకూడా అక్కడికి చేరుకుని మాట్లాడుకుంటున్నారు. అంతలో వారి స్నేహితుడు గంగాధర్ రాజమండ్రినుండి వచ్చాడు.

"ఏరా, గంగాధర్! ఇంత ఆలస్యమైంది?" అడిగాడు అరుణ్ పక్కన ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చోమన్నట్లుగా సంజ్ఞ చేస్తూ.

దానికి గంగాధర్, "నేను ఇంటినుండి బయలుదేరి బయటకు వచ్చేసరికి మా ఇంటిదగ్గర ఏక్సిడెంటులో శవం చచ్చి పడుంది. వేరే వీథిలోనుండి తిరిగి వచ్చేసరికి బస్సు తప్పిపోయింది" అంటూ కూర్చున్నాడు.

మిగతా స్నేహితులు, "శవం చచ్చిపోవడం ఏమిటిరా, సన్నాసీ?" అంటూ ఆట పట్టించారు.

ముఖం మాడ్చుకుని కూర్చున్న గంగాధర్‌తో, "సర్లేరా...ఏమీ బాధపడకు, స్పోర్టివ్‌గా తీసుకోవాలి" అన ఓదార్పుగా అన్నాడు శ్రీను. మళ్లీ..."అద్సరే...నీవు మాతోపాటే వచ్చేస్తావా... లాంచీలో వెళ్దాం" అని అడిగాడు.

గంగాధర్ తల అడ్డంగా ఊపి, "కుదరదురా ...అక్కావాళ్లు ఇక్కడే దగ్గరలో పోలవరంలో ఉన్నారు. అక్కడికి వెళ్లిరావాలి నేను" అన్నాడు.

గంగాధర్ శ్రీను కాళ్లకున్న చెప్పులను చూసి, "ఎక్కడ కొన్నావురా...మాడల్ బాగుంది" అని అడిగాడు.

"మన ఊరిలోనే" అంటూ కొన్న షాపు పేరు చెప్పాడు.

***

తెల్లవారుజామున గృహప్రవేశం జరిగింది. సత్యనారాయణ వ్రతం పూర్తయిన తరవాత భోజనాలు చేసి, ఆ సాయంత్రం తిరుగు ప్రయాణ మయ్యారు స్నేహితు లందరూ. అక్కడ ఫంక్షన్ జరుగుతున్నంతసేపూ శ్రీను మాటిమాటికి తన చేతులను సోపుతో కడుగుతుండడం గమనించాడు అరుణ్.

స్నేహితులను లాంచీ ఎక్కించడానికి గంగాధర్‌కూడా వచ్చాడు. అందరూ లాంచీ టాప్‌పైకి ఎక్కి, గంగాధర్‌కు టాటా చెప్తుండగా, లాంచీ బయలుదేరింది. గంగాధర్ రేవులోనే లాంచీ వెళ్లేవైపు చూస్తూ నిల్చున్నాడు. ఇంతలో శ్రీను కాలిచెప్పు గోదావరిలో పడిపోయింది.

అదిచూసిన అరుణ్, "దొరకడం కష్టం. పోనీలే ఇంకో జత కొనుక్కుందువుగాని"

అన్నాడు శ్రీనుతో.

రేవు దగ్గర కూర్చున్న గంగాధర్‌కి శ్రీను చెప్పు దొరికింది. పడిపోయినట్లుంది...దీనిని తీసుకెళ్లి వాడి కివ్వవచ్చు అనుకుని దానిని ఒక కవర్లో పెట్టుకుని పోలవరం వెళ్లడానికి బస్సుకోసం బయలుదేరాడు.

రెండు రోజుల తరవాత గంగాధర్ శ్రీను ఇంటికి వచ్చాడు. అరుణ్, శ్రీనులు టీవీలో క్రికెట్ చూస్తున్నారు. "ఒరేయ్ శ్రీనూ, నీ పడిపోయిన చెప్పు ఇదిగోరా" అంటూ చూపించాడు గంగాధర్.

శ్రీను బాధగా, "నీకు దొరికిందా...దొరకదేమో అనుకుని రెండోదికూడా గోదావరిలో పడేశాను" అన్నాడు.

గంగాధర్ ముఖం వివర్ణమైంది.

అరుణ్ నవ్వుతూ, "థాంక్సురా, గంగాధర్! ఒంటికాలి వాడికి ఎవరికైనా ఇచ్చేద్దాం" అన్నాడు.

"ఆ వ్యక్తికి ఎడమకాలు మాత్రమే ఉండాలిరా...చెప్పు కుడికాలికి పనిచేయదుమరి." గట్టిగా నవ్వుతూ అన్నాడు గంగాధర్.

శ్రీనుకు పట్టిసీమ వెళ్లివచ్చినప్పటినుంచి చేతివేళ్లపై దురదగా అనిపించసాగింది. అరుణ్ కాంపిటీటివ్ పరీక్ష కోచింగు కోసం రెండు నెలలు హైదరాబాదులో ఉన్నాడు. ఇంతలో శ్రీనుకి శరీరంపై దురదలు, దద్దుర్లు, చేతివేళ్లపై నల్లటి మచ్చలు రావడంతో కుష్ఠువ్యాధేమో అన్న అనుమానంతో డాక్టరును కలిశాడు. డాక్టరు మాత్రలు, ఆయింటుమెంటు రాసిచ్చాడు. అయినా, శ్రీనుకి ఉపశమనం కలగలేదు. చాలామంది డాక్టర్ల దగ్గర వైద్యం చేయించుకున్నాడు. డాక్టర్లు కుష్ఠురోగం కాదని తేల్చిచెప్పారు. కాని, శ్రీనుకిమాత్రం చాలా విచారంగా ఉంది. తన ముక్కుకూడా తప్పిడిగా అయిపోతుందేమో అనిపించసాగింది. ఎవరితోనూ సరిగా మాట్లాడకుండా ముభావంగా ఉంటున్నాడు. అరుణ్ హైదరాబాదునుండి వచ్చాడు. రెండు నెలల్లో తన స్నేహితుడు ఎలా మారిపోయాడో అని అతని పరిస్థితి విచారించి, తెలిసిన స్కిన్ స్పెషలిస్టు దగ్గరకు తీసుకెళ్లాడు. ఆయన కొన్ని పరీక్షలు చేసి ఇన్‌ఫెక్షన్ వల్ల వచ్చి ఉండవచ్చు అని వేరే మందులు రాసిచ్చాడు. అయినా శ్రీనుకు దురదలు, దద్దుర్లు తగ్గలేదు. శ్రీనుని మళ్లీ డాక్టరుదగ్గరకు తీసుకెళ్లాడు. ఆయన ఒక తెలిసిన హిప్నాటిస్టు దగ్గరకు వెళ్లమని సలహా ఇచ్చాడు.

హిప్నాటిస్టు శ్రీనుని ట్రాన్సులోకి తీసుకెళ్లి కొన్ని ప్రశ్నలు వేసి, చివరకు ఆ రోగానికి గల కారణం కనుగొన్నాడు. ఇంతకుముందు వాడుతున్న మందులే వాడమని చెప్పి, వారం రోజులు ప్రతి సాయంత్రం తన దగ్గరకు రమ్మని శ్రీనుకు చెప్పాడు. హిప్నోథెరపీద్వారా శ్రీనుకి దద్దుర్లను, దురదలను నివారించాడు. రెండు వారాలలో శ్రీను ఆరోగ్యంగా, ఉల్లాసంగా తయారయ్యాడు. శ్రీను ఆరోగ్యానికి ఆనందం వ్యక్తం చేస్తూ హిప్నాటిస్టు ఆ స్నేహితులిద్దరితో, "మీ ఫ్రెండు శ్రీనుకు రోగం ఏమీ లేదయ్యా...ఎలర్జీ మాత్రమే. కాని, అతను 'నేను కుష్ఠువాణ్ని ముట్టుకున్నాను...నాకు ఆ రోగం వస్తుంది' అని మనసులో ఒక ఫీలింగు పెట్టుకుని అవసరం ఉన్నా, లేకపోయినా చేతులను కడుక్కోవడం, చేతివేళ్లు బాగానే ఉన్నా వంకరగా ఉన్నట్లు బాధ పడడం, దురదలు లేకపోయినా దురద వస్తున్నట్లుగా గోక్కోవడంతో శ్రీను రోగం ప్రారంభమైంది. నీ కన్నా నీ స్నేహితుడు అరుణ్ అతనితో ఎక్కువసేపు గడిపాడని చెప్పావుకదా...మరి అతనికి రాని వ్యాధి నీకుమాత్రం ఎలా వస్తుంది? అసలు కుష్ఠు అంటువ్యాధి కాదు. నిజంగా కుష్ఠు ఉన్న వ్యక్తి మందులుద్వారా తగ్గించుకోవచ్చు. కాని నీలాంటివాడికి ఇంక అంతే. నిజానికి కుష్ఠువ్యాధి ఉన్నవాడికన్నా నీవే దారుణమైన రోగివి. కాని, నువ్వు ఇప్పుడు నిజంగా కోలుకున్నావు. పూర్తి ఆరోగ్యంగా ఉన్నావు. ఓకే...ఆల్ ద బెస్ట్" అని షేక్‌హాం డిచ్చాడు హిప్నాటిస్టు.

శ్రీనుకి అతను చెప్పిందంతా విన్నాక తనపై తనకే సిగ్గేసింది. శ్రీను మళ్లీ మామూలు మనిషయ్యాడు.

000

కాంటీనులో టీ తాగుతున్న శ్రీను, అరుణ్‌లను చూసి అక్కడికి వచ్చాడు గంగాధర్. అరుణ్ వేసుకున్న షర్టును చూసి, "షర్టు బావుంది...ఎంతకు కొన్నావురా" అనడిగాడు గంగాధర్.

"రెండు వందలు." చెప్పాడు అరుణ్.

"ఇంకో ఏభై వేస్తే కొత్తది వస్తుందికదరా." గట్టిగా నవ్వుతూ అన్నాడు గంగాధర్.

అందుకు అరుణ్ కొంచెం ఇబ్బందిగా చూస్తూ, "సర్లే మంచి జోకు వేశావు...బజారుకు వెళ్దాంపద" అన్నాడు.


స్నేహితులు ముగ్గురూ బజార్లో నడుస్తున్నారు. ఇంతలో ఒక వ్యక్తి మోటారుసైకిలుపైనుండి దిగి, "హలో అరుణ్! బాగున్నారా?" అని పలకరించాడు.

ఎవరా అని ఆలోచిస్తున్న అరుణ్‌తో, "నేనండీ....మరిచిపోయారా...ప్రసాదును. ఇప్పుడు నేను చాలావరకు రికవర్ అయాను. ముక్కుకు ప్లాస్టిక్ సర్జరీకూడా చేయించుకున్నాను" అన్నాడు.

అంతవరకూ ఆశ్చర్యంగా చూస్తున్న శ్రీను, "ఓ మీరా...సినిమా హీరోలా ఉన్నరు. ఏదైనా సినిమాకు ప్రయత్నం చేయకూడదా?!" అంటూ పలకరించాడు.

వారిద్దరినీ చూసి శ్రీనుని మనసులోనే అభినందించాడు అరుణ్ శ్రీనులో వచ్చిన మార్పుకు.

■



## టైరా... లేక...!?

*ఈ అతి పెద్ద టైర్‌ను చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతూంది కదూ? జపానులోని బ్రిజ్‌స్టోన్ టైర్ల కంపెనీ వారు, తాము తయారుచేసిన ఈ టైర్ ప్రపంచంలోనే అతి పెద్దదని అంటున్నారు. దీని బరువు 5.1 టన్నులు, వ్యాసం 4.02 మీటర్లు. నిజానికి దీన్ని ప్రత్యేకించి, 350 టన్నుల బరువున్న ట్రక్కుల కోసం డిజైన్ చేశారు. ఉత్తర అమెరికా-ఇండోనీషియాల మధ్య తిరుగుతాయి ఆ ట్రక్కులు. ఈ ఒక్క టైర్ ఖరీదు 3.5 మిలియన్ల యెన్‌లు. అంటే 29 వేల అమెరికన్ డాలర్లన్నమాట.*

ఎన్.